క్లుప్తంగా

25న పల్లెపాటల పోటీ

అచ్చంపేట రూరల్: మండలంలోని నడింపల్లి వినాయకనగర్ దుర్గాభవాని ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 25న గురువారం పల్లె పాటలు, బతుకమ్మ పాటల పోటీని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శివ, మహేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామం నుంచి పోటీల్లో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. మొదటి బహుమతి రూ. 10వేలు, రెండో బహుమతి టీవీ, మూడో బహుమతి కుక్కర్‌ను దాత బూరం సురేష్‌యాదవ్ అందించనున్నారని తెలిపారు. ఆసక్తిగల వారు సెల్: 9398994691, 9912685122 నంబర్లను సంప్రదించాలని వారు కోరారు.

మహిళలకు వైద్య శిబిరం ఏర్పాటు

వెల్దండ: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం స్వస్థనారి స్త్రీశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రత్యేక డాక్టర్ మణికర్ణ రోగులకు వివిధ పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ సింధు, సిబ్బంది ఆజాద్, పర్వతాలు, మురళీకృష్ణ, సుమిత్ర, కవిత, అనిత, శ్రీనివాస్, మధుసూదన్‌రెడ్డి, జహంగీర్‌బీ, తదితరులు ఉన్నారు.

పీహెచ్‌సీలో టీబీ క్యాంప్

ఊర్కొండ: మండలంలోని ఊర్కొండపేటలోని ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రంలో సోమవారం మండల వైద్యాధికారులు టీబీ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా 100 మందికి టీబీ పరీక్షలు నిర్వహించారు. ప్రతి ఒక్కరూ టీబీ పరీక్షలు చేయించుకోవాలని గ్రామస్తులను కోరారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఎస్ బాలాజీ సింగ్, ఎస్టీఎస్ గౌరీ కుమార్, ఎంపీహెచ్ఏలు రామచంద్రారెడ్డి, భరత్, ఎంఎలు పవన్, కల్యాణ్, ఆశావర్కర్ భాగ్యమ్మ, మణెమ్మ తదితరులు ఉన్నారు

అనుమతి కోసం కలెక్టర్‌కు వినతి



నాగర్‌కర్నూల్: ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులకు కథల పోటీలు నిర్వహించడానికి అనుమతి ఇవ్వాలని రాష్ట్ర భాష సాంస్కృతిక శాఖ కమిటీ సభ్యుడు ముచ్చర్ల దినకర్, గుడిపల్లి నిరంజన్, జిల్లా సైన్స్ అధికారి రాజశేఖర్ రావు, వెంకట్ పవార్‌లు సోమవారం కలెక్టర్ బదావత్ సంతోష్‌కు వినతిపత్రం అందజేశారు. విద్యార్థుల సృజనాత్మకతను వెలికితీయడానికి పోటీలు దోహదం చేస్తాయని వివరించారు. దీనికి కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. అదేవిధంగా 'మన ప్రజాపాలన, ప్రగతి వైపుకు తెలంగాణ పయనం' అనే పుస్తకాన్ని కలెక్టర్ బదావత్ సంతోష్, ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్‌లకు రచయిత ముచ్చర్ల దినకర్ అందజేశారు.

వినూత్న నిరసన



అచ్చంపేట రూరల్: సమస్యలను పరిష్కరించాలని ట్రైబల్ వెల్ఫేర్ వసతిగృహాల్లో విధులు నిర్వర్తిస్తున్న రోజువారి వర్కర్ల చేపట్టిన నిరవధిక సమ్మె సోమవారం నాటికి 11వ రోజుకు చేరింది. ఏడు నెలల పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో బతుకమ్మ ఆడుతూ వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి శంకర్‌నాయక్, వర్కర్స్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సురేందర్, భరత్, పర్వతాలు, అంజమ్మ, పద్మ, బాలమణి, చిట్టెమ్మ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

కల్వకుర్తి రూరల్: మండలంలోని కురుమిద్ద, పీఎస్ తండా, సిలార్ పల్లి, తాండ్ర, హరిజనవాడ తదితర ప్రాథమిక పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి పాఠశాల విద్యను బలోపేతం చేయాలని టీఆర్టీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మునగాల సతీష్ డిమాండ్ చేశారు. సోమవారం ఎంఈఓ శంకర్ నాయక్ కు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణకు ఉద్యమిద్దాం

మన్ననూర్: రాజ్యాంగం పరిరక్షణ కోసం ప్రజాస్వామికవాదులంతా ఉద్యమించాలని అచ్చంపేట డివిజన్ సీపీఐ కార్యదర్శి పెర్ముల గోపాల్ పిలుపునిచ్చారు. ఆదివారం మన్ననూరులో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 21 నుంచి 25వ తేదీ వరకు పంజాబ్‌లో నిర్వహిస్తున్న 25వ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని కోరారు.



పెద్దకొత్తపల్లిలో దుర్గామాతకు పూజలు నిర్వహిస్తున్న ఆర్యవైశ్యులు



ఈగలపెంట స్టాఫ్ క్వార్టర్స్‌లో పూజలు చేస్తున్న ఉద్యోగులు



అమ్రాబాద్ అమరేశ్వరాలయంలో దుర్గాదేవికి హారతి ఇస్తున్న మహిళలు

కొలువుదీరిన దుర్గామాత



వెల్దండలో పూజలు చేస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు



కొల్లాపూర్‌లో వరిదేల శమీవృక్షం వద్ద ప్రతిష్ఠించిన దుర్గాదేవి విగ్రహం

సాక్షి, నెట్‌వర్క్: నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా సోమవారం ఏర్పాటు చేసిన మండపాలలో దుర్గామాత విగ్రహాలను ప్రతిష్ఠించారు. మండపాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. అమ్మవారిని వివిధ రూపాలలో అలంకరించి కొలిచారు. కుటుంబసమేతంగా దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

■ అచ్చంపేటలో మొదటిరోజు అమ్మవారు బాలత్రిపురసుందరీదేవీగా దర్శనమిచ్చారు. శ్రీశైలం ఉత్తర ద్వారమైన ఉమామహేశ్వర క్షేత్రంలో శైలపుత్రి అలంకారంలో అమ్మవారిని ప్రతిష్ఠించి కుంకుమార్చన చేశారు.

■ అమ్రాబాద్, పదర మండలంలోని పలు గ్రామాలలో ఏర్పాటు చేసిన మండపాలలో దుర్గామాత కొలువుదీరారు.

■ బిజినేపల్లి మండలం పాలెంలో అమ్మవారు బాలత్రిపుర సుందరీదేవిగా దర్శనిమిచ్చారు.

■ వెల్దండ మండల కేంద్రంలోని పేట ఆంజనేయ స్వామి దేవాలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించారు. దుర్గామాతను ధనలక్ష్మి దేవిగా అలంకరించారు. మహిళలు కుంకుమార్చన చేశారు.

■ పెద్దకొత్తపల్లి మండల కేంద్రంతో పాటు పెద్దకారుపాముల కన్యాకపరమేశ్వరి ఆలయాల్లో, చెన్నపురావుపల్లిలో దుర్గామాతను శైలాపుత్రికగా అలంకరించారు.

■ కోడేరు ఉమామహేశ్వరాలయంలో అమ్మవారిని బాలత్రిపురసుందరీ దేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు.

■ కొల్లాపూర్‌లో వరిదేల శమీవృక్షం వద్ద, వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో, రామాపురం, మొలచింతలపల్లి గ్రామాల్లో దుర్గాదేవి విగ్రహాలను ప్రతిష్ఠించారు. వివిధ రూపాల్లో అమ్మవారిని కొలిచారు.

■ కల్వకుర్తి పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో వాసవీమాతను ధాన్య లక్ష్మీదేవిగా అలకరించారు. పల్లకీ సేవ, గోపూజ, అనంతరం సామూహిక కుంకుమార్చనలను నిర్వహించారు.

■ ఉప్పునుంతలతోపాటు మండలంలోని కాంసానిపల్లి, మర్రిపల్లి, తిర్మలాపూర్, లక్ష్మాపూర్, తాడూరు, వెల్టూరు, ఫిరట్వానిపల్లి, పెనిమిళ్ల తదితర గ్రామాల్లో దుర్గామాత అమ్మవారి విగ్రహాలను ప్రతిష్ఠించారు. మొదటి రోజు అమ్మవారు బాలత్రిపురసుందరీదేవి రూపంలో దర్శనమిచ్చారు.

■ ఈగలపెంటలోని స్టాఫ్ క్వార్టర్స్ ప్రాంగణంలో అమ్మవారి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు.

■ తిమ్మాజిపేటతో పాటు పోతిరెడ్డిపల్లి, చేగుంట, గొరిట, మరికల్, ఇప్పలపల్లి, హనుమాన్‌తండాలలో అమ్మవారు కొలువుదీరారు.

■ లింగాల మండల కేంద్రంతో కోమటికుంటలో అమ్మవారిని బాలాత్రిపురసుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు.



కోడేరులో బాలత్రిపురసుందరీ దేవిగా అమ్మవారు



ఉమామహేశ్వరంలో...



బిజినేపల్లి మండలం పాలెంలో..



ఉప్పునుంతల మండలం కాంసానిపల్లిలో ..



అచ్చంపేట భక్త మార్కండేయ శివాలయంలో..



కల్వకుర్తిలో పల్లకీ సేవ నిర్వహిస్తున్న భక్తులు

సీఎం రేవంత్‌రెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేత



ముఖ్యమంత్రిని కలిసిన సత్యసాయి సేవా సమితి సభ్యులు

కల్వకుర్తిరూరల్: పట్టణంలో నిర్మించిన సత్యసాయి మందిరం ప్రారంభోత్సవానికి రావాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనముల రేవంత్ రెడ్డిని సత్యసాయి సేవా సమితి సభ్యులు కలిసి ఆహ్వాన పత్రిక అందించారు. సోమవారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో సాయి భక్తులు ముఖ్యమంత్రిని కలిశారు. అంతకుముందు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి ఆధ్వర్యంలో కలిసి ఆహ్వానించారు. అక్టోబర్ నెలలో మందిరం ప్రారంభానికి రావలసిందిగా ప్రముఖులను ఆహ్వానించినట్లు సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో సత్యసాయి సేవ సమితి సభ్యులతో పాటు మాజీ సర్పంచులు ఆనంద్ కుమార్, భూపతిరెడ్డి, జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు బచ్చు రామకష్ణ, సత్య సాయి సేవ ట్రస్ట్ చైర్మన్ గుబ్బ ఈశ్వరయ్య, జిల్లా కన్వీనర్ గుబ్బ శంకరయ్య తోపాటు ట్రస్టు సభ్యులు ఉన్నారు.

గిరిజన సంఘం నాయకుల ముందస్తు అరెస్టు



వెల్దండలో గిరిజన నాయకుల అరెస్టు చేసిన పోలీసులు

వెల్దండ: లంబాడీలు, ఆదివాసుల మధ్య ఎస్టీ రిజర్వేషన్ వ్యవహారంలో ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిపై ముఖ్యమంత్రి ఇంటి ముట్టడికి రాష్ట్ర గిరిజన సంఘం పిలుపునిచ్చింది. ఈ మేరకు మండల కేంద్రంలోని ఎల్‌హెచ్‌పీఎస్ గిరిజన నాయకులను సోమవారం పోలీసులు ముందస్తు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సేవాలాల్ సేనా జిల్లా ఉపాధ్యక్షుడు ఇస్లావత్ విజేష్‌నాయక్ మాట్లాడుతూ అరెస్టుతో ఉద్యమాన్ని అపలేరన్నారు. ప్రభుత్వం గిరిజన సమస్యలను పట్టించుకోవడంలేదని ఆరోపించారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు జైరామ్‌నాయక్, లక్ష్మణ్‌నాయక్, గోవర్ధన్‌నాయక్, శ్రీను, రాహుల్, రఘు తదితరులు ఉన్నారు.

చారకొండ: లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలనే కుట్రకు వ్యతిరేకంగా ఎల్‌హెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి ఇంటి ముట్టిడి పిలుపున్విడంతో సోమవారం చారకొండ మండలంలోని ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులను పోలీసలు ముందస్తు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.అరెస్ట్ మండల నాయకులు సరీరాం నాయక్, నాయకులు లక్పతి, లక్ష్మణ్, రాజేష్, తదితరులు ఉన్నారు.

బకాయి వేతనాలు చెల్లించాలి



చారకొండలో అధికారులకు వినతిపత్రం అందిస్తున్న కార్మికులు

చారకొండ: పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో మండలంలోని గ్రామ పంచాయతీ కార్మికులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండల కేంద్రంలో ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులకు వినతి పత్రం అందించి మాట్లాడారు. నాలుగు నెలలుగా పంచాయతీ కార్మికులకు వేతనాలు చెల్లించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. సమస్యలు పరిష్కరించకుంటే ఈనెల 29 ధర్నా చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బాలస్వామి, పంచాయతీ కార్మికులు గెల్వయ్య, వెంకటేష్, లక్ష్మయ్య, రవి, లక్ష్మయ్య, కవిత, కృష్ణ, లక్ష్మయ్య, రామకోటి తదితరులు ఉన్నారు.

దసరాకు మహిళలకు నాలుగు చీరలు ఇవ్వాలి



మాట్లాడుతున్న దేవని కుమార్‌మాదిగ

కొల్లాపూర్: బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా మహిళలకు నాలుగు చీరలు ఇవ్వాలని బీఆర్ఎస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు దేవని కుమార్ మాదిగ కోరారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గతేడాది చీరల పంపిణీ ప్రభుత్వం చేపట్టలేదని ప్రస్తుతం గత సంవత్సరంతో కలిపి మొత్తం నాలుగు చీరలు ఇవ్వాలన్నారు. అదేవిధంగా మహిళలకు ఇచ్చిన మాట ప్రకారం నెలకు రూ.2,500 కూడా చెల్లించాలన్నారు. మహిళలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు.

మహాసభలకు తరలిన సీపీఐ నాయకులు



బయలుదేరిన సీపీఐ జాతీయ నాయకులు

నాగర్‌కర్నూల్ రూరల్: దేశంలో కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించి వంద సంవత్సరాలు అయిన సందర్భంగా పంజాబ్ రాష్ట్రంలోని చండీగఢ్ 25 జాతీయ మహాసభలు నిర్వహిస్తున్నారు. జాతీయ మహాసభలకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం బాల్‌నర్సింహ, రాష్ట్ర సమితి సభ్యుడు కేశవులు గౌడ్, జిల్లా కార్యదర్శి ఎస్ఎండీ ఫయాజ్ తరలివెళ్లారు.

ఆయుర్వేదంలో దీర్ఘకాలిక వ్యాధులు నయం



ర్యాలీలో పాల్గొన్న వైద్య సిబ్బంది

బిజినేపల్లి: ఆయుర్వేదంలో దీర్ఘకాలిక వ్యాధులు నయం అవుతాయని ఆయుష్ విభాగం జిల్లా అధికారి డా. కే.గోపాల్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఆయుర్వేద వైద్యంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని ప్రధాన మార్గాల్లో వైద్య సిబ్బంది ర్యాలీ చేపట్టారు. అనంతరం డా. కే.గోపాల్ మాట్లాడుతూ వివిధ రోగాల బారిన పడకుండా ముందు జాగ్రత్తలపై. యోగాసనాల ద్వారా వ్యాధులను ఎలా నివారించుకోవచ్చో వివరించారు. రక్తపోటు, మధుమేహం, రక్తహీనత, తదితర వ్యాధులకు మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి శివకుమార్, డా. అజహర్ అహ్మద్, జిల్లా పోగ్రాం మేనేజర్ డా.సురేష్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



ఉప్పునుంతల: అధిక వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిహారం అందించి ఆదుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి చింతల నాగరాజు డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన సీపీఎం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పత్తి, ఇతర పంటలు పూర్తిగా దెబ్బ తిన్నాయన్నారు. పంటల నష్టంపై అధికారులు సర్వే చేయాలన్నారు. నాయకులు హుస్సేన్, బాలస్వామి, గిరి, మల్లేష్, కరుణాకర్, శ్రీను పాల్గొన్నారు.

ఓటర్ జాబితాపై సమీక్ష

తిమ్మాజిపేట: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం రెవెన్యూ అధికారులు బీఎల్ఓలతో ఓటర్ జాబితాపై సమీక్షించారు. 2002 నాటి ఓటరు జాబితా పరిశీలన చేసి 2025 జాబితాలో చనిపోయిన వారి పేర్లు తొలగించాలని సూచించారు. కొత్తగా పెళ్లి అయిన వారిని, డబుల్ పేర్లు ఉన్న వారిని గుర్తించాలని తెలిపారు.

ఏఎన్ఎంల వేతనాలు చెల్లించాలని ధర్నా

నాగర్‌కర్నూల్ రూరల్: గిరిజన ఆశ్రమ పాఠశాలలో అవుట్‌సోర్సింగ్ ఏఎన్ఎంలుగా పని చేస్తున్న వారికి వేతనాలు చెల్లించాలని కోరుతూ సోమవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ శ్రీనివాసులు మాట్లాడుతూ ఏడు నెలలుగా జీతాలు లేక ఏఎన్ఎం ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి సమస్య పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి శంకర్‌నాయక్, పోదిలిరామయ్య, భరత్, నాగమణి, మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

వైద్యులపై చర్యలు తీసుకోవాలి



వెల్దండ: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు రోగులను పట్టించుకోవడం లేదని బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు డిప్యూటీ తహసీల్దార్ కిరణ్‌కుమార్‌కు వినతి ప్రతం అందజేశారు. వైద్యం కోసం ఆస్పత్రికి వెళ్తే సిబ్బంది రోగులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని వాపోయారు. వైద్యం అందించడంపై నిర్లక్ష్యం వహిస్తున్న డాక్టర్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. మాజీ ఎంపీపీ పుట్టరాంరెడ్డి, మాజీ ఉపసర్పంచ్ నిరంజన్, లింగం ముదిరాజ్, నిరంజన్, అశోక్, రాజు, ప్రవీణ్, రవి, రఘు, జగన్, దాసు తదితరులు ఉన్నారు.

ఏపీఓకు వినతి

తెలకపల్లి: పెండింగ్ బిల్లులను తక్షణమే చెల్లించాలిన వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింహ డిమాండ్ చేశారు. సోమవారం ఉపాధి హామీ కార్యాలయంలో ఏపీఓ మల్లేష్‌కు మేట్ల సంఘం ఆధ్వర్యంలో ఉపాధి కూలీలు వినతిపత్రం అందించారు. అంతకుముందు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. మేట్ల సంఘ జిల్లా కార్యదర్శి భాస్కర్, కూలీలు శాంతమ్మ, కళావతమ్మ, జాఫర్, తిరుపతమ్మ, వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై నిరంతర పోరాటం

తిమ్మాజిపేట: విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాడుతామని ఏబీవీపీ మండల కన్వీనర్ వెంకటేష్ అన్నారు. హైదరాబాద్‌లో హెచ్‌సీయూలో విద్యార్థి సంఘాల ఎన్నికల్లో ఏబీవీపీ విజయం సాధించడంతో సోమవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట విద్యార్థులతో కలిసి విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. ఎస్ఎఫ్‌డీ కన్వీనర్, శ్రీశైలం, విద్యార్థులు శ్రీను, లోకేష్, సైదులు, అరుణ్, సత్యం, సుజాత పాల్గొన్నారు.

ఉద్యోగాలను భర్తీ చేయాలి



నాగర్‌కర్నూల్ రూరల్: వివిధ శాఖలలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కొట రమేష్ డిమాండ్ చేశారు. సోమవారం డీవైఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు శివశంకర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలన్నారు. మొదటి ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామన్నా హామీ ఏమైందని ప్రశ్నించారు. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి రూ.4వేలు ఇవ్వడంలో నిర్లక్ష్యం వహించడం తగదన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి నాగపూర్ మధు, జిల్లా సహాయ కార్యదర్శి రవి, జిల్లా నాయకులు కురుమయ్య, మల్లికార్జున్, బీరయ్య పాల్గొన్నారు.

బోరు మోటారుకు మరమ్మతు



లింగాల: మండలంలోని సూరాపూర్ బంజారా కాలనీలో నీటి సమస్య తీవ్రంగా ఉండడంతో కాలనీకి చెందిన యువకులు స్వంత డబ్బులతో తాగునీటి బోరుకు మరమ్మతు చేశారు. నీటి సమస్యను తీర్చిన యువకులకు మాజీ ఉప సర్పంచు శ్రీను, మత్యనాయక్, శంకర్‌లు కృతజ్ఞతలు తెలిపారు.

జిల్లా పోక్సో కోర్టు ఎస్పీపీ నియామకం

కందనూలు: జిల్లా ఫాస్ట్ ట్రాక్‌స్పెషల్ కోర్టు, పోక్సో కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా న్యాయవాది పెద్దిరెడ్డి దామోదర్ రెడ్డిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లా కోర్టులో పోక్సో స్పెషల్ పీపీగా విధుల్లో చేరారు. రాష్ట్ర క్రైమ్ బ్రాంచ్ ప్రభుత్వ హోమ్ (న్యాయశాఖ) శాఖ ఉత్తర్వుల మేరకు ఆయన స్పెషల్ పీపీగా మూడు సంవత్సరాలు సేవలు అందించనున్నారు. దామోదర్ రెడ్డికి నాగర్ కర్నూల్, కొల్లాపూర్, అచ్చంపేట, కల్వకుర్తి బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్లు, న్యాయవాదులు శుభాకాంక్షలు తెలిపారు.

కొనసాగుతున్న కంటి పరీక్షలు

తెలకపల్లి: మండలంలోని దాసుపల్లి గ్రామానికి చెందిన చిమర్ల జగదీశ్వర్‌రెడ్డి హేమలత సౌజన్యంతో మండల కేంద్రంలో సీఎల్ఆర్ కళాశాలలో శంకర నేత్రాలయ సహకారంతో సోమవారం కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 160 మంది కంటి పరీక్షలు చేయించుకున్నారు. కంటి సమస్యలు ఉన్న వారికి ఈ నెల 25 ఆపరేషన్ చేయనున్నట్లు రెడ్‌క్రాస్ సొసైటీ కార్యదర్శి రమేష్‌రెడ్డి, రాజమహేందర్‌రెడ్డి తెలిపారు. సింగిల్ విండో వైస్ చైర్మన్ మామిళ్లపల్లి యాదయ్య, ప్రకాష్‌రెడ్డి, రాజు, అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

రైతులకు రిమోట్ యంత్రాల పంపిణీ

కల్వకుర్తి రూరల్: రైతుల సంరక్షణ దేశ భవిష్యత్తు అని జాతీయ యువజన అవార్డు గ్రహీత శివకుమార్ అన్నారు. సోమవారం ఏడీఏ కార్యాలయం ఆవరణలో 500 మంది రైతులకు ఉచితంగా బోరు మోటర్ రిమోట్ యంత్రాలను అందజేశారు. రెండు కిలోమీటర్ల దూరం నుంచి రిమోట్ సహాయంతో మోటార్ ఆన్ ఆఫ్ చేసుకోవడం ద్వారా ప్రాణనష్టాన్ని తగ్గించుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. పశుసంవర్ధక శాఖ అధికారి భాస్కర్ రెడ్డి శివను అభినందించారు. వెటర్నరీ అసిస్టెంట్ ప్రణీత, హరీష్, రైతులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలికి అవార్డు అందజేత

కందనూలు: సాహితీ, సామాజిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కళా సేవా రంగాలలో పరిశోధనలు, సేవలు అందిస్తున్న నాగర్‌కర్నూల్ పట్టణానికి చెందిన ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయురాలు డాక్టర్ మంద సురేఖకు దాసరి నారాయణరావు స్మారక ప్రతిభా అవార్డు దక్కింది. ఆ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లో అవార్డు అందజేశారు. సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ ఆలూరి విల్సన్, తదితరులు ఉన్నారు.